వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 330
పేజీలు : 08 | వెల: రూ.5/-
గురువారం
అక్టోబర్ 16, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



6లో..

## రైతులకు నాణ్యమైన విద్యుత్

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి





# ఒకే ఒక్కడు

## నాయిని రాజేందర్ రెడ్డి

- పశ్చిమ నియోజకవర్గ ప్రగతి ప్రదాత
- పక్కా ప్రణాళికతో ముందడుగు
- ముక్కుసూటితనం ఆయన నైజం
- ప్రతిపక్షాలను మాటల తూటాలతో చీల్చి చెండాడే నేర్పరి
- పార్టీతోపాటు అధికార యంత్రాంగంపై పూర్తి పట్టు

సవాళ్లను స్వీకరించే వ్యక్తిత్వం.. సంప్రదాయాన్ని గౌరవించే మనస్తత్వం.. దాపరికాలే లేని ముక్కుసూటి వ్యవహారం.. ఇది వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వ్యవహార శైలి. రాజకీయ పరంగా అనునిత్యం అప్రమత్తంగా ఉంటూనే విరోధుల కదలికలపై ఓ లుక్కేయడంలో ఆయన దిట్ట. పరిస్థితులకు అనుగుణంగా పక్కా ప్రణాళికలతో ముందడుగు వేయడంలో నాయిని రాజేందర్ రెడ్డి పెట్టింది పేరు. విపక్షాల వ్యూహాలను గమనిస్తూ.. వారిని మాటల తూటాలతో చీల్చి చెండాడంలో ఆయన నేర్పరి. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ తో పాటు సీనియర్ మంత్రులతో సన్నిహితంగా వ్యవహరిస్తూ హనుమకొండ జిల్లా రాజకీయాల్లో చెరగని ముద్ర వేస్తున్నారు. 2023 డిసెంబర్ 9న ఎమ్మెల్యే పదవిని చేపట్టిన రాజేందర్ రెడ్డి కాకతీయుల గడ్డ ఓరుగల్లులో తనకంటూ ప్రత్యేక ఇమేజ్ ను సృష్టించుకున్నారు. అధికారులైన, ప్రజా ప్రతినిధులైన, అనుచరులైన అవసరాలను బట్టి అర్థవంతంగా మాట్లాడుతారన్న అభిప్రాయం ఉంది. రాజకీయాల్లో సమయానుకూలంగా వ్యవహరిస్తూ పార్టీలో, అధికార యంత్రాంగంపైన పూర్తి పట్టును సాధించిన నాయిని చారిత్రక ఓరుగల్లు మహానగరం ఒకే ఒక్కడుగా వెలుగొందుతున్నారు.

వివరాలు2లో..



8లో..

## క్రీడలకు ప్రాధాన్యం

- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- ఘనంగా ప్రారంభమైన అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలు

## సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



8లో..



8లో..

## 18న బంద్ ను విజయవంతం చేయండి

- బీసీ రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్ లో చేర్చే వరకు ఉద్యమిస్తాం
- ఉమ్మడి జిల్లా బీసీ జేఏసీ ఛైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్

- పశ్చిమ నియోజకవర్గ ప్రగతి ప్రదాత
- పక్కా ప్రణాళికతో ముందడుగు
- ముక్కుసూటితనం ఆయన నైజం
- ప్రతిపక్షాలను మాటల తూటాలతో చీల్చి చెండాడే నేర్పరి
- పార్టీతోపాటు అధికార యంత్రాంగంపై పూర్తి పట్టు

గద్దం కేశవమూర్తి






# ఒకే ఒక్కడు

# నాయిని రాజేందర్ రెడ్డి





**సవాళ్లను స్వీకరించే వ్యక్తిత్వం.. సంప్రదాయాన్ని గౌరవించే మనస్తత్వం.. దాపరికాలేని ముక్కుసూటి వ్యవహారం.. ఇది వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వ్యవహార శైలి. ఓరుగల్లు జిల్లాలో రాజకీయాలు చేయడం అంటే కత్తిమీద సామే! అయితే, విద్యార్థి దశ నుంచే.. ఎవరితోనైనా పోటీపడే తత్వం, ఆత్మవిశ్వాసం, సంకల్ప బలం ఆయనలో మెండుగా ఉంది. రాజకీయ పరంగా అనునిత్యం అప్రమత్తంగా ఉంటూనే విరోధుల కదలికలపై ఓ లుక్కేస్తుంటారు. విపక్షాల వ్యూహాలను గమనిస్తూ.. పరిస్థితులకు అనుగుణంగా పక్కా ప్రణాళికలతో నాయిని రాజేందర్ రెడ్డి ముందుకు వెళ్తున్నారు.**

ప్రతి పక్షాలను మాటల తూటాలతో చీల్చి చెండాడుతూ వరంగల్ జిల్లా రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. 2023 డిసెంబర్ 9న ఎమ్మెల్యే పదవిని చేపట్టిన రాజేందర్ రెడ్డి కాకతీయుల గడ్డ ఓరుగల్లులో తనకంటూ ప్రత్యేక ఇమేజ్ ను సృష్టించుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా, ప్రస్తుతం హనుమకొండ జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేగా విశిష్ట సేవలు అందిస్తున్నారు. అధికారులైన, ప్రజా ప్రతినిధులైన, అనుచరులైన అవసరాలను బట్టి అర్థవంతంగా మాట్లాడుతారన్న ఖ్యాతిని గడించారు. రాజకీయాల్లో సమయానుకూలంగా వ్యవహరిస్తున్నారు. పార్టీ పైన, అధికార యంత్రాంగం పైన పూర్తి పట్టును సాధించిన నాయిని చారిత్రక ఓరుగల్లు మహానగరం ఒకే ఒక్కడుగా వెలుగొందుతున్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ తో పాటు సీనియర్ మంత్రులతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూ.. అభివృద్ధిలో హనుమకొండను ప్రగతి పదాన నిలుపుతున్నారు.

## సమగ్రాభివృద్ధే లక్ష్యం..

వరంగల్ పశ్చిమ నియోజకవర్గం సమగ్రాభివృద్ధికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నిరంతరం పనిచేస్తున్నారు. ప్రజాసేవ చేసే అవకాశాన్ని కల్పించిన ప్రజల అవసరాలు తీర్చడమే లక్ష్యంగా ఆయన పనిచేస్తున్నారు. వరంగల్ మహానగర అభివృద్ధికి 2057 జనాభాను దృష్టిలో పెట్టుకొని రూ.4,100 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను త్వరలో ప్రారంభించబోతున్నారు. అలాగే, 2040 వరకు జనాభా పెరుగుదలకు అనుగుణంగా భవిష్యత్ అవసరాలకు సరిపోయేలా మాస్టర్ ప్లాన్ ను తీసుకువచ్చారు. భద్రకాళి దేవాలయం ఆధునీకరణలో భాగంగా చేపట్టిన మాడవీధుల నిర్మాణ పనుల్లో వేగం పెంచారు. అలాగే ప్రాచీన కాలం నాటి హనుమకొండ కలెక్టర్ బంగ్లాను ఆధునికరించారు. వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల శాశ్వత భవనానికి రూ.27 కోట్ల నిధులను తీసుకొచ్చారు. పశ్చిమ పరిధిలోని 26 డివిజన్ల లో స్థానిక కార్పొరేటర్ చైర్మన్ గా మరో నలుగురు సభ్యులతో కమిటీలను ఏర్పాటు చేసి 3,500 ఇండ్లను నిరుపేదలకు పంపిణీ చేశారు. అదేవిధంగా బాలసముద్రంలో నిర్మించిన 592 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులకు అందజేశారు. రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్ ను మంజూరు చేయించారు. కాకతీయ యూనివర్సిటీ ప్రాంగణంలో దీనిని ఏర్పాటు చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. 54వ డివిజన్ పోచమ్మ కుంటలోని శ్మశాన వాటికను కోటి రూపాయల వ్యయంతో మోడల్ వైకుంఠధామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. ఈ పనులకు మరో మూడు కోట్లు సాధించే ప్రయత్నం చేస్తున్నారు. క్రీడారంగాన్ని అభివృద్ధి పరిచేందుకుగాను జిల్లాకు స్పోర్ట్స్ స్కూల్ ను సాధించారు. ములుగు రోడ్డులోని ఐటీఐ ప్రాంగణంలో మూడు అడ్వాన్స్డ్ ట్రైనింగ్ సెంటర్ (ఏటీసీ)ల నిర్మాణానికి రూ.22 కోట్ల నిధులను సాధించారు. అలంకార్ జంక్షన్ లో మున్నూరు కాపు బిల్డింగ్ కోసం రూ.6.70 కోట్ల నిధులను తీసుకొచ్చారు. కేంద్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల కోసం సెంట్రల్ వెల్నెస్ సెంటర్ ను సాధించారు.

## కుల, మతాలకు అండగా..

ప్రజల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న నాయిని రాజేందర్ రెడ్డి ప్రధాన కుల సంఘాలకు, మతాలకు అండగా నిలుస్తున్నారు. ముస్లిం, క్రిస్టియన్లకు శ్మశాన వాటికలు లేవని గుర్తించిన ఆయన కాజీపేట మండలం మడికొండలో మూడెకరాల చొప్పున ప్రభుత్వ భూమిని వారికి అందజేశారు. వడ్డెర్లకు కాజీపేట జూబ్లీ మార్కెట్ సమీపంలో వేయి గజాలు అందజేశారు. రెడ్ క్రాస్ ఓల్డ్ ఏజ్ హోమ్ కు సోమిడిలో 500 గజాలు స్థలం కేటాయించారు. ట్రాన్స్ జెండర్లకు సోమిడిలో కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేస్తున్నారు. కాజీపేటలోని గంగపుత్ర సంఘానికి కమ్యూనిటీ హాల్ కోసం స్థలం ఇప్పించారు. కాజీపేట ప్రెస్ క్లబ్ నిర్మాణం కోసం వేయి గజాల స్థలాన్ని మడికొండలో కేటాయించారు. హనుమకొండలో సీబీసీ చర్చి స్థలాన్ని కొందరు ఆక్రమించుకుంటే.. అధికారుల సహకారంతో ఖాళీ చేయించి ఆ స్థలాన్ని చర్చి యాజమాన్యానికి అప్పగించారు. అదేవిధంగా మరికొన్ని కులాల వారికి కూడా కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు కృషి చేస్తున్నారు. నియోజకవర్గంలో వేలాది మంది అర్హులకు రేషన్ కార్డులను జారీ చేయడంతో పాటు వేలాది మంది కుటుంబ సభ్యుల పేర్లను అదనంగా రేషన్ కార్డులలో చేర్పించారు. కాళోజీ కళాక్షేత్రం, నయీంనగర్ బ్రిడ్జిని పూర్తి చేసి ప్రజల ఆదరాభిమానాలు పొందిన ఆయన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ సర్వతో ముఖాభివృద్ధికి నిరంతరం కృషిచేస్తున్నారు.







# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బిల్లులు వెంటనే అందించాలి

**● కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశం**




**వరంగల్ వాయిస్, జనగామ :** దశలవారీగా జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు వెంటనే లబ్ధిదారులకు అందేలా క్షేత్రస్థాయి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ స్పష్టం చేశారు. లబ్ధిదారులకు ఆర్థిక ఆసరా కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన ఆదేశించారు. గురువారం క్యాంపు కార్యాలయం నుంచి హౌసింగ్ పీడీ, మండల స్పెషల్ అధికారులు, ఎంపీడీఓ, ఎంపీఓ, ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గూగుల్ మీటింగ్ ద్వారా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దశలవారీగా నిర్మాణం అవుతున్న ఇళ్ల ఫొటోలను త్వరగా ఆన్‌లైన్‌లో నమోదు చేసి, లబ్ధిదారులకు బిల్లులు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో పాటు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారులకు వెంటనే మంజూరు ఇవ్వాలని సూచించారు. డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో స్వయం సహాయక సభ్యులకు బ్రిక్, సిమెంట్, సెంట్రింగ్ యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన రుణాలను కూడా అందించాలని కలెక్టర్ తెలిపారు. అంతేకాకుండా, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా గుర్తించిన అర్హులైన లబ్ధిదారుల జాబితాను గ్రామ స్థాయిలో పరిశీలన అధికారులను నియమించి, మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి ధ్రువీకరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## దివ్యాంగుల సేవ విశ్వమానవ సేవ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఛైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు, వరల్డ్ వైజ్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ నేషనల్ వైస్ ఛైర్మన్ అయిన డాక్టర్ అనితా రెడ్డి వరంగల్‌లోని లూయిస్ ఆదర్శ అంధుల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ అనితా రెడ్డి, కేయూ ప్రొఫెసర్ రమ, సంతోష్ రెడ్డి సహకారంతో పిల్లల భోజన సౌకర్యం కోసం నిత్యావసర సరుకులు, బియ్యం బస్తాలు, చదువు కోసం బ్రెయిలీ పేపర్లు, పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చక్కగా పాటలు పాడి వినిపించారు. వారి ప్రతిభను చూసి డా.అనితా రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల సేవ విశ్వమానవ సేవ అని పేర్కొన్నారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ఆమె అభినందించి, ఉన్నత చదువులకు ప్రోత్సహించారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యం అని తెలియజేస్తూ, విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఏ అవసరం ఉన్నా సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నానని ఆశ్రమ సిబ్బందికి ఆమె హామీ ఇచ్చారు. వారికి అమ్మలా ఆత్మీయ స్పర్శను అందించారు. చూపు లేకపోయినా, ఈ విద్యార్థులు మనోనేత్రములతో చూడగలరని, వీరికి ప్రేమ, ఆప్యాయతలు అందించి ప్రోత్సహిస్తే అన్ని రంగాలలో ముందుంటారని ఆమె అన్నారు. అంధుల సేవ దైవ సేవతో సమానమని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డితో పాటు కేయూ ప్రొఫెసర్ రమ, సంతోష్ రెడ్డి, మణికంట, ఆశ్రమ ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## బొబ్బర్లకి 'సంగమం జీవన సాఫల్య పురస్కారం'



**వరంగల్ వాయిస్, జనగామ :** కృష్ణాజిల్లా, చందర్లపాడు మండలం, బొబ్బర్లపాడు గ్రామానికి చెందిన విశిష్ట వ్యక్తి బొబ్బర్ల శ్రీ గోపాలకృష్ణ సాయికి ఘన సన్మానం జరిగింది. గత 40 సంవత్సరాలుగా బొబ్బర్లపాడు గ్రామ సర్పంచ్‌గా నిస్వార్థంగా కొనసాగుతున్న ఆయన, తన అపారమైన నిజాయితీకి మారుపేరుగా నిలిచారు. ఆయన సామాజిక సేవ, కళారంగానికి చేసిన కృషికి గుర్తింపుగా, ఒక స్వచ్ఛంద సంస్థ నిన్న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సామాజిక సాంస్కృతిక జీవిత వజ్రోత్సవ వేడుకలు నిర్వహించింది. ఈ వేడుకల్లో శ్రీ గోపాలకృష్ణ సాయికి "సంగమం జీవన సాఫల్య పురస్కారం–25" అవార్డును అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రి, శ్రీ గోపాలకృష్ణ సాయితో పాటు అంతర్జాతీయ పద్య నాటక, కళారంగ నిపుణులు గుమ్మడి గోపాలకృష్ణుడిని కూడా సన్మానించారు. ఇటువంటి అరుదైన అవకాశం దక్కినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్, నటులు కొండా శ్రీనివాస్ మాట్లాడుతూ అంతటి మహానటులను సన్మానించే కార్యక్రమంలో తనకు అవకాశం దక్కినందుకు మిక్కిలి ఆనందపడుతున్నానని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నటులు నామాల సిద్ధులు, ప్రదీప్ లు కూడా పాల్గొన్నారు.


# కాంగ్రెస్ పార్టీలో నూతన ఒరవడి

**▪ జిల్లా అధ్యక్ష పదవిపై ప్రజాభిప్రాయ సేకరణ**



**వరంగల్ వాయిస్, హుజురాబాద్ :** నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన కాంగ్రెస్ పార్టీ 'సంఘటన్ శ్రీజన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా, జిల్లా అధ్యక్ష పదవి ఎంపిక కోసం కార్యకర్తల అభిప్రాయ సేకరణ ఉత్సాహంగా జరిగింది. గురువారం హుజురాబాద్ పట్టణంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కర్ణాటక రాష్ట్ర హంగల్ శాసనసభ్యుడు మానే శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానే శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ పార్టీ 'సంఘటన్ శ్రీజన్ అభియాన్' ద్వారా నూతన ఒరవడిని తీసుకొచ్చిందని పేర్కొన్నారు. అనంతరం మానకొండూర్ శాసనసభ్యుడు కవ్వంపల్లి సత్యనారాయణ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, టీపీసీసీ పరిశీలకులు మ్యాడం బాలకృష్ణ మీడియాతో మాట్లాడారు. వార్డు స్థాయి నుంచి అభిప్రాయ సేకరణ ఈసారి జిల్లా అధ్యక్షుల ఎంపిక గతంలో కంటే భిన్నంగా ఉంటుందని వారు తెలిపారు. వార్డు, గ్రామం, మండల, నియోజకవర్గ స్థాయి నాయకుల అభిప్రాయాలను తీసుకుని జిల్లా అధ్యక్షుడిని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. దేశంలోని ఐదు రాష్ట్రాల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసుకుని, దక్షిణ భారతదేశంలో తెలంగాణకు దీనిని తీసుకువచ్చామని వారు వివరించారు.జిల్లా పరిశీలకులు నాయకుల అభిప్రాయాలు తీసుకుంటున్నారని, ప్రజల మధ్య ఉండి, వారితో మమేకమయ్యే నాయకులకే అవకాశం దక్కుతుందని వారు స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో కేవలం జిల్లా అధ్యక్షులే కాక, మండల నాయకులను కూడా ఇదే విధంగా ఎన్నుకుంటామని వారు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ నియోజకవర్గంతో పాటు సైదాపూర్, చిగురుమామిడి మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహా రుద్ర యాగశాల సంప్రోక్షణ



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని కుంకుమేశ్వర ఆలయంలో 108 కలశాలతో మహా రుద్ర యాగశాల సంప్రోక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పండితులు సంపత్ శర్మ మహా రుద్రం గురించి పూర్తి వివరాలను వివరించారు. పండితులు సంపత్ శర్మ వివరణ ప్రకారం శివుని ఆశీస్సులు, దైవిక రక్షణ మరియు అనుగ్రహం పొందడానికి మహా రుద్రం ఒక ముఖ్యమైన వేద కర్మ."మహా" అంటే గొప్పది, "రుద్రం" అంటే శివుడికి అంకితం చేయబడిన శక్తివంతమైన వేద స్తోత్రాల జపం. మహా రుద్రం అంటే ఈ రుద్ర స్తోత్రాలను 1331 సార్లు నైపుణ్యం కలిగిన పూజారుల బృందం అనేక రోజుల పాటు పఠించడం. శాంతి, శ్రేయస్సు కోసం శివుని ఆశీస్సులు కోరడం ప్రధాన ఉద్దేశం. రుద్ర మంత్రాల జపం పరిసరాల నుంచి ప్రతికూల శక్తులను శుభ్రపరుస్తుందని, సానుకూల ప్రకంపనలను ఇస్తుందని నమ్ముతారు. తప్పులకు క్షమాపణ కోరడానికి, ఆధ్యాత్మిక వృద్ధి, సాక్షాత్కారాన్ని పొందడానికి కూడా దీనిని నిర్వహిస్తారు. వ్యక్తిగత ప్రయోజనాలుగా—జపం, సామూహిక ప్రార్థనల వల్ల వ్యక్తుల కంపన పౌనఃపున్యాలు పెరుగుతాయని, ఆనందం పెరిగి, మానసిక సమస్యలు తగ్గుతాయని విద్యుదయస్కాంత సిద్ధాంతం ప్రకారం భావిస్తారు. ఈ కార్యక్రమంలో సృష్టించబడిన సామూహిక శక్తి సమాజానికి ప్రయోజనం చేకూరుస్తుందని, హృదయపూర్వక సంబంధాలను పెంపొందిస్తుందని ఆయన వివరించారు. మహా రుద్రం తరచుగా ప్రత్యేక సందర్భాలలో లేదా ఆధ్యాత్మిక పండుగలలో నిర్వహిస్తారు.

## కనుకుంట్ల ముత్తయ్య మృతి




**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** హసన్ పర్తి రిపోర్టర్ కనుకుంట్ల సతీష్ తండ్రి కనుకుంట్ల ముత్తయ్య గురువారం తెల్లవారుజామున అకాల మరణం చెందారు. ముత్తయ్య మరణ వార్త తెలుసుకుని పాత్రికేయ మిత్రులు, రాజకీయ నాయకులు, స్థానిక ప్రజలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. వారి అకాల మరణం పట్ల విలేకరులతో పాటు స్థానిక ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. రిపోర్టర్ సతీష్‌తో పాటు వారి కుటుంబ సభ్యులకు ఈ దుఃఖాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

## పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ దాడి



**వరంగల్ వాయిస్, మల్లూర్ :** జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాల మేరకు, టాస్క్ ఫోర్స్ సీఐ రమేష్ తన సిబ్బందితో కలిసి మల్లూర్ మండలంలోని తాడిచెర్ల అటవీ ప్రాంతంలోని పేకాట స్థావరాలపై బుధవారం రాత్రి మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో 10 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి వద్ద నుంచి రూ. 50,500 నగదు, 10 మొబైల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం, ఒక షిఫ్ట్ డిజైర్ కారు, 52 ప్లేయింగ్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన నిందితులను, స్వాధీనం చేసుకున్న వస్తువులను తదుపరి చట్టపరమైన చర్యల కోసం కొయ్యూరు పోలీసులకు అప్పగించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, అటువంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి వివరాలను పోలీసులకు అందించి సహకరించాలని సూచించారు.

## నూతన ఎంపీడీవోగా రామ రామకృష్ణ



**వరంగల్ వాయిస్, నడికూడ :** నూతన మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా రామ రామకృష్ణ గురువారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన గజ్జల విమల బదిలీ కాగా నేడు రామ రామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది నూతన ఎంపీడీవోకు స్వాగతం పలికారు.

# భద్రకాళి, వేయి స్తంభాల ఆలయాల్లో దేబాశిష్ పట్నాయక్ ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) పరిశీలకులు దేబాశిష్ పట్నాయక్ గురువారం నగరంలోని ప్రముఖ ఆలయాలను సందర్శించారు. ఆయన భద్రకాళి దేవస్థానం, వేయి స్తంభాల దేవాలయంలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా, ఆలయ వేద పండితులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేసి, అమ్మవారి వస్త్రాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ పరిశీలకులతో పాటు పీసీసీ కోఆర్డినేటర్ డాక్టర్ నాగులూరి అరుణ్ కుమార్ గౌడ్, మాజీ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర యూత్ వైస్ ప్రెసిడెంట్ విష్ణుదాసు వంశీధర్ రావు పాల్గొన్నారు.

# శివలింగ, నవగ్రహ అష్ట బలిపీఠ ప్రతిష్టాపన



**వరంగల్ వాయిస్, గణపురం :** వచ్చే నెల నవంబర్ 13, 14, 15, 16 తేదీలలో ప్రఖ్యాతి గాంచిన కాకతీయుల కాలం నాటి శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి దేవాలయంలో శివలింగ, నవగ్రహ, అష్ట బలిపీఠ ప్రతిష్టాపన మహోత్సవం జరగనుంది. ఈ ప్రతిష్ఠాపన మహోత్సవం కోసం గణపురం మండల కేంద్రానికి చెందిన మాదాసు సురేష్ దంపతులు తమ వంతుగా రూ. 5,000 విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్ కి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ముసునూరి నరేష్, సురేష్ దంపతులకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండారు శంకర్, మూలా శ్రీనివాస్ గౌడ్, భటిక స్వామి, బూర రాజగోపాల్ గౌడ్, మాదాసు మొగిలి గౌడ్, మాదాసు అర్జున గౌడ్, ఉయ్యాల భిక్షపతి గౌడ్, దయ్యాలభద్రయ్య, పాండవుల భద్రయ్య, మోటపోతుల రాజన్న గౌడ్, గోరంటల రాజన్న గుప్త తదితరులు పాల్గొన్నారు.

# కోటగుళ్లలో వరల్డ్ హెరిటేజ్ వలంటీర్స్ సందడి



**వరంగల్ వాయిస్, గణపురం :** కాకతీయుల కళాక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం (కోటగుళ్లు) ను బుధవారం వరల్డ్ హెరిటేజ్ వలంటీర్స్ 2025 బృందం సందర్శించింది. రామప్పలో జరుగుతున్న పది రోజుల శిక్షణలో భాగంగా దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి, అలాగే ఇరాన్ దేశం నుంచి వచ్చిన శిక్షణార్థులు క్షేత్రస్థాయి సందర్శనలో భాగంగా గణపురం కోటగుళ్లకు వచ్చారు. ఆలయ సందర్శన సందర్భంగా అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ డాక్టర్ కుసుమ సూర్య కిరణ్ వారికి దేవాలయం చరిత్ర, దాని ప్రాముఖ్యత గురించి వివరంగా వివరించారు. అలాగే, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రొఫెసర్ పాండురంగారావు గణపురం దేవాలయం నిర్మాణ శైలి (ఆర్కిటెక్చర్) గురించి సాంకేతికంగా వివరించారు. వారి వెంట కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ శ్రీధర్ రావు, వరల్డ్ హెరిటేజ్ క్యాంప్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

◆ వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజల పాలిట వరమని వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు కె.ఆర్. నాగరాజు అన్నారు. హనుమకొండ సుబేదారిలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం, ఐనవోలు మండలం రాంనగర్ గ్రామానికి చెందిన కిడ్నీ సమస్యతో బాధపడుతున్న బొమ్మకంటి యాకయ్య కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే నాగరాజు రూ. 1,50,000 విలువైన ఎల్ఓసీ కాపీనీ అందజేశారు. హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స కోసం ఈ నిధులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం పేదలకు వైద్య విషయంలో అండగా ఉంటుందని, తన దృష్టికి వచ్చిన అనారోగ్య సమస్యలకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీకి గురి కాకుండా, ప్రభుత్వ నిమ్స్ ఆస్పత్రిలో తాము ఇచ్చే ఎల్ఓసీ ద్వారా ఉచిత చికిత్స పొందాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆపద కాలంలో అండగా నిలిచిన ఎమ్మెల్యే నాగరాజుకు బొమ్మకంటి యాకయ్య కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, ఖిలా వరంగల్, హన్మకొండ మండలాల పరిధిలోని 32 మంది లబ్ధిదారులకు చెందిన రూ. 32



లక్షల 3 వేల 712 విలువ గల కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో జేబీఎం చైర్మన్ జన్నపురెడి రుగ్వేద్ రెడ్డి, కార్పొరేటర్ ఈదురు అరుణ-విక్టర్, మాజీ జడ్పీటీసీ బానోతు సింగిలాల్, కాంగ్రెస్ నాయకులు, హనుమకొండ మండల పార్టీ అధ్యక్షుడు మాదాసి అజయ్, డివిజన్ల అధ్యక్షులు కొంక హరిబాబు, చింత ప్రకాష్, వర్ధన్నపేట సోషల్ మీడియా కోఆర్డినేటర్ పుట్ట తిరుపతి, కాంగ్రెస్ నాయకులు చింత రమేష్, దూలం సదానందం, మణింద్రనాథ్, బూర్ల శ్రీనుతో పాటు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# 'బంద్ ఫర్ జస్టిస్'ను జయప్రదం చేయండి



**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు ఈ నెల 18న బీసీ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన 'బంద్ ఫర్ జస్టిస్'ను విజయవంతం చేయాలని వరంగల్ బీసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు మాట్లాడుతూ బలహీనవర్గాలకు చట్టసభల్లో రిజర్వేషన్లు లేకపోగా, స్థానిక సంస్థల్లో ఉన్న రిజర్వేషన్లు కూడా తగ్గిపోవడం వల్ల బీసీలకు రాజకీయ అవకాశాలు దక్కడంలో అన్యాయం జరిగిందని అభిప్రాయపడ్డారు. గతంలో స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఉండగా, 2019లో అవి 23 శాతానికి తగ్గాయని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లను 42 శాతానికి పెంచినా, చట్టాలను అడ్డంపెట్టి అడ్డుకోవడం సామాజిక న్యాయానికి, సహజ న్యాయానికి విరుద్ధమని అన్నారు. బీసీ నాయకులు ధారబోయిన సతీష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలను మభ్యపెట్టకుండా, పార్లమెంటరీ ప్రక్రియ ద్వారా చట్టపరంగా రిజర్వేషన్లు సాధించే ప్రయత్నాలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా రిజర్వేషన్ల సాధనకి సహకరించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించి, వాటిని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బుట్టి శ్యామ్ యాదవ్, ఎదునూరి రాజమౌళి మాట్లాడుతూ, అక్టోబర్ 18న రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న బంద్‌కు రాజకీయ పార్టీలు, వ్యాపార వర్గాలు, విద్యా సంస్థలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు, కార్మికులు, బీసీ సంఘాలు, కుల సంఘాలు బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బంద్‌లో భాగంగా బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు అమరవీరుల స్థూపం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు సంఘీభావ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో జోరుగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు



**వరంగల్ వాయిస్, పరకాల :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పరకాల శాసనసభ్యుడు రేవూరి చొరవతో మండలంలో ముమ్మరంగా కొనసాగుతున్నాయని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) పెద్ది ఆంజనేయులు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు తమ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం ఆయన మండల పరిధిలోని వెల్లంపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. నిర్మాణం పూర్తి చేసుకున్న వారికి డబ్బులు ఖాతాలో జమ అయ్యాయో లేదో అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇసుక, ఇటుక, కంకర వంటి సామాగ్రి విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. ఈ నెల చివరి వరకు సాధ్యమైనంత ఎక్కువ మొత్తంలో గృహ ప్రవేశాలు చేయాలని ఎంపీడీఓ సూచించారు. మండలంలోని 10 గ్రామాలకు శాసనసభ్యులు 285 ఇళ్లు కేటాయించగా, ఇప్పటివరకు వివిధ దశలలో పనులు పూర్తి చేసిన 169 మంది లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ అయినట్లు ఆయన తెలిపారు. మిగిలిన వారు కూడా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

# కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ

**వరంగల్ వాయిస్, దామెర :** హనుమకొండ జిల్లా దామెర మండలంలోని ఊరుగొండ గ్రామంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు సునీల్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల మాజీ వైస్ ఎంపీపీ జాకీర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాకీర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అమలు కాని హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకొని, తద్వారా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యనారాయణ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సుదర్శన్, మాజీ ఉపసర్పంచ్ విద్యాసాగర్, బండి సతీష్, పోలెపాక రాజేందర్, జన్ను సాంబయ్య, వినయ్, కందికొండ నాగరాజు, గొల్లపెల్లి కొమురయ్య,



పోలేపాక లక్ష్మినారాయణ, జన్ను సదయ్య, సాంబారి నరేష్, అక్కెల్ల శ్రీనివాస్, మస్న రమేష్, మస్న విజేందర్, పోలెపాక రమేష్, జన్ను శ్రీను, జన్ను సుమన్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
గురువారం, అక్టోబర్ 16, 2025

# ఇసుక రవాణాపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి

## ◆ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ ఆదేశం



**వరంగల్ వాయిస్, మల్హర్/భూపాలపల్లి :** ఇసుక రవాణాలో పర్యవేక్షణ లోపం రాకుండా అధికారులు కఠినంగా వ్యవహరించాలని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరఫరాపై రెవెన్యూ, పోలీస్, అటవీ, మైనింగ్, గృహ నిర్మాణ, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. నంబర్ ప్లేట్లు లేని వాహనాలను తక్షణం సీజ్ చేయాలి. అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందాలు నిరంతర పర్యవేక్షణ చేయాలి. ప్రభుత్వం నిర్దేశించిన రీచ్‌ల నుండి మాత్రమే ఇసుక రవాణా జరగాలి. మన జిల్లా ప్రజలకు మాత్రమే ఇసుక సరఫరా చేయాలి; ఇతర జిల్లాలకు/ప్రాంతాలకు రవాణా పూర్తిగా నిషేధం. సరిహద్దుల్లో సీసీ కెమెరాల ద్వారా పటిష్ఠ పర్యవేక్షణ చేపట్టాలి. అక్రమ ఇసుక నిల్వలు ఉంచితే సీజ్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఇసుక రవాణాకు ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుంది. కూపన్ ఆధారంగా ఒక వాహనానికి ఒక రోజుకు ఒక ట్రిప్పు రవాణాకే అనుమతి. కూపన్ లేని వాహనాలను సీజ్ చేయాలి. అధిక లోడు వేసే వాహనాలను సీజ్ చేయడంతో పాటు జరిమానాలు విధించాలి. ఇందిరమ్మ గృహ నిర్మాణదారులు ఇసుక కొరకు తమ గ్రామ పంచాయతీ కార్యదర్శి ద్వారా కూపన్ పొందాలి. ఆదివారాలు, ప్రభుత్వ సెలవు దినాల్లో ఇసుక రవాణాకు అనుమతి ఉండదు. ఈ సమావేశంలో కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, మైనింగ్ ఏడీ జయరాజు, డీపీఓ శ్రీలత, భూపాలపల్లి నియోజకవర్గ మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ల బంద్‌కు సంపూర్ణ మద్దతు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీసీ కులాలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న బీసీ కుల సంఘాలు ఇచ్చిన రాష్ట్ర బంద్ కార్యక్రమానికి సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి పత్రికా ప్రకటనలో తెలిపారు. కొత్తపల్లి రవి ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై ప్రశ్నలు లేవనెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ, మంత్రివర్గంలో చేసిన తీర్మానం గవర్నర్ వద్ద ఎందుకు పెండింగ్‌లో ఉందని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్లను ఆమోదిస్తూ చేయాల్సిన చట్టబద్ధ కార్యక్రమాలను ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. బాధ్యతను విస్మరించిన కేంద్రం... రాష్ట్ర ప్రభుత్వాన్ని ముద్దాయిగా నిలబెట్టే ప్రయత్నాలను ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. అఖిలపక్ష పార్టీలను, రిజర్వేషన్లు కోరుతున్న కుల సంఘాలను కలుపుకొని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత నాది కాదంటూ వ్యవహరించడం సరికాదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ఓట్ల రాజకీయాలను ప్రజలు అర్థం చేసుకోవాలని, అంతిమంగా పీడిత ప్రజలు ఐక్యమై వర్గ పోరాటాలను నిర్వహించటమే దీనికి పరిష్కారమని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 18న ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ కార్యకర్తలు, ప్రజా సంఘాలు, అనుబంధ సంఘాల నాయకులు చురుకుగా పాల్గొని బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు. త్రిపోతుల బన్నీ, కుంట భాస్కర్, కె.బాలు, ఎం.వెంకటేష్, విజయ్, కిరణ్, వినోద్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

## చేర్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్వేత



**వరంగల్ వాయిస్, నర్మెట :** తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ ధాన్యాన్ని విక్రయించాలని చేర్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేత అన్నారు. మండలంలోని వెల్దండ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు గంగం నరసింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణతో కలిసి గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్వేత మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతోందని అన్నారు. సామాన్యులకు, రైతులకు అందుబాటులో ఉండే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రైతులు తమ ధాన్యానికి మద్దతు ధర వచ్చేందుకు, సన్న వడ్లకు బోనస్ వచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని కోరారు. రైతు పండించిన సన్న వడ్లకు బోనస్ కల్పించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని ఆమె గుర్తుచేశారు. ప్రజా పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు పోతుందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు. చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామెడీ జీవన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ వంగా భూపాల్ రెడ్డి, గ్రామ అధ్యక్షులు పెద్దమాతరి నర్సింలు, నాయకులు మంకెన మోహన్ రెడ్డి, ఐకేపీ కేంద్ర నిర్వాహకులు బైరగోని మంజుల, కళ్యాణం యాదలక్ష్మి, చంద్రకళ, సిబ్బంది పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ల కోసం పోరాటం

## ◆ 18న రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలి




**వరంగల్ వాయిస్, కేయూ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు దక్కాల్సిన 42 శాతం రిజర్వేషన్ల సౌకర్యాన్ని అడ్డుకుంటున్న కుట్రలను నిరసిస్తూ ఈ నెల 18న బీసీ జేఏసీ ఇచ్చిన తెలంగాణ రాష్ట్ర బంద్ కార్యక్రమానికి బహుజన విద్యార్థి సంఘం (బీఎస్ఎఫ్) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. బీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్, కాకతీయ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బహుజనులందరూ భాగస్వాములు కావాలని కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 9ను వ్యతిరేకిస్తూ కొందరు హైకోర్టుకు వెళ్లడం, హైకోర్టు స్టే ఇవ్వడం బాధాకరమన్నారు. అగ్రవర్ణాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తే బీసీలు స్వాగతించిన విషయాన్ని విస్మరించి, బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తే కుట్రలు, కుతంత్రాలు పన్నుతూ అడ్డుకోవడం దుర్మార్గమైన చర్యగా ఆయన అభివర్ణించారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీల జనాభా ఎంతో, రిజర్వేషన్ల వాటా కూడా అంతే స్థాయిలో ఉండాలని బొట్ల మనోహర్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బీసీ సామాజిక వర్గానికి రాజకీయాల్లో సముచిత ప్రాధాన్యత దక్కడం లేదని, దీంతో రాజకీయంగా బీసీలు వెనుకబడి ఉన్నారని తెలిపారు. బీసీలకు స్థానిక సంస్థల్లోనే కాకుండా, చట్టసభల్లో కూడా జనాభా దామాషా పద్ధతిలో రిజర్వేషన్ కల్పించే విధంగా చట్టం చేయాల్సిన ఆవశ్యకత ఉందని, ఆ దిశగా కూడా బీఎస్ఎఫ్ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. బీసీల రిజర్వేషన్ల సాధన కోసం జేఏసీ ఇచ్చిన కార్యక్రమాలను చేపడుతూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన విద్యార్థి సంఘం నాయకులు బాశిపాక కార్తీక్, జె

# నరకాసుర వధ ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఈ నెల 19న జరగనున్న నరకాసుర వధ ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేస్తామని క్రైమ్ అండ్ ట్రాఫిక్ డీసీపీ రాయల ప్రభాకర్ హామీ ఇచ్చారు. నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మరుపల్ల రవి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు గురువారం డీసీపీ రాయల ప్రభాకర్ ని కలిసి పూల బొకే ఇచ్చి, వినతిపత్రం సమర్పించారు. దీపావళి పండుగ సందర్భంగా జరిగే ఈ ఉత్సవాలలో బాంబులను అమర్చి దహనం చేస్తారని, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, ఈ కార్యక్రమాలను తిలకించడానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు మరియు పెద్ద ఎత్తున ప్రజలు విచ్చేస్తారని కమిటీ అధ్యక్షులు మరుపల్ల రవి డీసీపీకి వివరించారు. వరంగల్ ఏఎస్పీ శుభం ప్రకాష్, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, మిల్స్ కాలనీ సీఐ బొల్లం రమేష్, ట్రాఫిక్ సీఐ సుజాతలకు కూడా నరకాసుర వధ ఉత్సవాలకు బందోబస్తు ఏర్పాటు చేయాలని కమిటీ తరపున వినతిపత్రాలు అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నరకాసుర వధ ఉత్సవ కమిటీ ప్రతినిధులు మరుపల్ల గౌతం, ఆవునూరి రామ్మూర్తి, దూడే బాల కొమురెల్లి, వనం మధు, శెట్టి మోహన్, మాటేటి శ్యామ్, శివ, సతీష్, ద్రౌపతి సురేష్ లు ఉన్నారు.

# ఎమ్మెల్యే దొంతికి సుందర్ రాజ్ యాదవ్ పరామర్శ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి తల్లి దొంతి కాంతమ్మ ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసానికి ఓబీసీ చైర్మన్, కుడా మాజీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ వెళ్లి ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డిని, వారి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసి, పరామర్శించారు. వీరి వెంట దూడయ్య యాదవ్, వేణుగోపాల్ గౌడ్, సూర్య, ప్రమోద్ ఉన్నారు.

# భవన నిర్మాణ నిబంధనలు పాటిస్తేనే అనుమతులు

## జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భవన నిర్మాణ నిబంధనలను పాటిస్తేనే అనుమతులు జారీ చేస్తామని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ స్పష్టం చేశారు. నూతన భవనాల నిర్మాణాలకు అనుమతుల మంజూరు, పెద్ద భవన నిర్మాణాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీకై కమిషనర్ గురువారం నగర పరిధిలోని ఎక్సైజ్ కాలనీ, శ్రీనివాస కాలనీ, బ్యాంక్ కాలనీ, సాయి గణేష్ కాలనీ, చింతగట్టు ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా నమోదు చేసిన వివరాలను, కొలతలను ఆమె స్వయంగా పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ భవన నిర్మాణాల అనుమతుల కోసం దరఖాస్తు చేసిన సందర్భంలో సూచించిన ధృవపత్రాలు నమోదు చేసి, నిబంధనలు పాటిస్తే చట్టం ప్రకారం అనుమతులు, ఆక్యుపెన్సీ మంజూరు చేస్తామని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారికి అనుమతులు ఇవ్వడం జరగదని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఏసీపీలు యెర్షాద్, రజిత తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన విద్యుత్ సేవలు

● ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి వెన్నెముకైన రైతులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సేవలు అందిస్తున్నామని, వ్యవసాయ సర్వీసుల మంజూరును యుద్ధ ప్రాతిపదికన విడుదల చేస్తున్నామని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి స్పష్టం చేశారు. వ్యవసాయ సర్వీసుల మంజూరు వివరాలను సీఎండీ వెల్లడించారు. 2023లో 31,550 సర్వీసులు విడుదలయ్యాయి. 2024లో 39,693 సర్వీసులను విడుదల చేశారు. (2023తో పోలిస్తే దాదాపు 8,143 సర్వీసులు ఎక్కువ, అంటే 26% పెరుగుదల). 2025లో (అక్టోబర్ 16 వరకు) 34,306 సర్వీసులు మంజూరయ్యాయి. (2024తో పోలిస్తే ఇప్పటివరకు 12% పెరిగింది). ఇంకా మూడు నెలల సమయం ఉన్నందున, మరింత అధికంగా సర్వీసులు మంజూరు చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. పోల్‌లు, లైన్‌లు లేని కనెక్షన్లను ఒక నెలలో, ఓఆర్సీ (ఓన్ రీసోర్స్ కంట్రిబ్యూషన్ ) చెల్లించాల్సి ఉంటే రెండు నెలల్లో మంజూరు చేస్తున్నామని వివరించారు. కొత్త కనెక్షన్ కోసం నమోదు చేసుకున్నప్పటి నుంచి సర్వీస్ విడుదలయ్యే వరకు ప్రతి దశలోనూ రైతులకు వారి మొబైల్ నంబర్‌కు తెలుగులో అప్‌డేట్ మెసేజ్‌లు పంపిస్తున్నారు. ఈ మెసేజ్‌లలోని లింక్‌ను క్లిక్ చేస్తే స్టేటస్ రిపోర్ట్ మొత్తం తెలుస్తుంది. ఎస్టిమేట్, ఓఆర్సీ వివరాలు, డిమాండ్ నోటీస్, మెటీరియల్ డ్రా వంటి వివరాలు సందేశాల రూపంలో వస్తాయి. స్టోర్‌లలో కావాల్సిన మెటీరియల్ ముందుగానే అందుబాటులో ఉంచడం వలన ఎక్కడా కొరత లేదని, రైతులు ఎటువంటి మెటీరియల్ కొనాల్సిన, డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని సీఎండీ స్పష్టం చేశారు. ఏదైనా ఇబ్బంది ఉంటే 1912కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. మెటీరియల్ త్వరితగతిన విడుదల అయ్యేలా ఈ-స్టోర్ విధానాన్ని తీసుకొచ్చామని, దీని ద్వారా క్షేత్రస్థాయి అధికారులు ఆన్‌లైన్‌లో బుక్ చేసి, మెటీరియల్‌ను డ్రా చేసుకునే సౌలభ్యం కల్పించామని తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా, ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోగానే వెంటనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చడానికి కొత్తగా వాహనాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులను వేగవంతం చేయడానికి కొత్తగా ఎస్పీఎం షెడ్‌లు ఏర్పాటు చేశామని, తద్వారా ఆలస్యం కాకుండా రైతులకు సేవలు అందుతున్నాయని వివరించారు. రైతులకు మరింత చేరువై వారి సమస్యలను పరిష్కరించే దిశగా విద్యుత్ అధికారుల "పొలంబాట" కార్యక్రమాన్ని చేపట్టామని, ఇప్పటివరకు 4,064 కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి వంగిన పోల్‌లను, లూజ్ లైన్‌లను సరిచేస్తున్నామని, మధ్య స్తంభాలను (3,140), స్పేసర్‌లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఓవర్‌లోడ్ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచారు. 2025లో (అక్టోబర్ 16 వరకు) 5,448, 2024లో 8,129, 2023లో 5,203 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచినట్లు సీఎండీ వివరించారు. రైతుల పట్ల నిబద్ధతతో, వారి శ్రేయస్సును కోరుతూ వ్యవసాయ సర్వీసుల మంజూరు విషయంలో అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని సీఎండీ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాల కేర్ టేకర్‌గా డాక్టర్ శాగంటి శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయం మహిళా ఇంజనీరింగ్ కళాశాల కేర్ టేకర్ గా డాక్టర్ శాగంటి శ్రీనివాస్‌ను నియమిస్తూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.భిక్షాలు, సూపరింటెండెంట్ బి.వీరు నాయక్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ శ్రీనివాస్ గతంలో దూర విద్యా కేంద్రం కేర్ టేకర్‌గా రెండు పర్యాయాలు, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ గానూ పనిచేశారు. ఆయన దూర విద్యా కేంద్రం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా మూడుసార్లు గెలుపొందారు. ప్రస్తుతం అదే పదవిలో కొనసాగుతున్నారు .శ్రీనివాస్ నియామకం పట్ల ఇంజనీరింగ్ కళాశాల బోధనేతర సిబ్బంది సంజయ్, యాదగిరి, రాజేష్, తిరుమల్ సింగ్, సాయి, ఫిరోజ్, సుమన్, తాజ్, మధు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

# కన్స్ట్రక్షన్ డెమాలిషన్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కన్స్ట్రక్షన్ డెమాలిషన్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలను వేగవంతం చేయాలని కమిషనర్ అండ్ డైరెక్టరేట్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) డాక్టర్ టి.కె. శ్రీదేవి ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షా సమావేశంలో వరంగల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఇతర అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీడీఎంఏ డా. శ్రీదేవి నగరంలో చేపట్టనున్న బయో మైనింగ్ పురోగతితో పాటు కన్స్ట్రక్షన్ డెమాలిషన్ ప్లాంట్ ఏర్పాటు వివరాలను అడిగి తెలుసుకున్నారు.దానికి స్పందిస్తూ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ, ఇప్పటికే ఆర్ఎఫ్‌పీ పిలవడం జరిగిందని, టెండర్ ప్రక్రియ పూర్తి చేసి ప్లాంట్ ఏర్పాటుకు వేగవంతంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో ఎస్.ఈ. సత్యనారాయణ, సీ.హెచ్.ఓ. డాక్టర్ రాజారెడ్డి, ఈఈ. మహేందర్ పాల్గొన్నారు.

# కార్యకర్తల అభిప్రాయం మేరకే అధ్యక్షుడి ఎంపిక

ఏఐసీసీ పరిశీలకుడు నవజోత్ పట్నాయక్




**వరంగల్ వాయిస్, వరంగల్ :** కార్యకర్తల అభిప్రాయం మేరకు ప్రజల్లో ఉండే నాయకుడే వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకోవడం జరుగుతుందని ఏఐసీసీ పరిశీలకుడు నవ జ్యోతి పట్నాయక్ అన్నారు. గురువారం వరంగల్ బస్టాండ్ దగ్గరలో ఎంకె నాయుడు ఫంక్షన్ హాల్ లో వరంగల్ తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ (ఏఐసీసీ) పరిశీలకులుగా విచ్చేసిన నవజ్యోతి పట్నాయక్, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు పాల్గొన్నారు, వరంగల్ డీసీసీ అధ్యక్ష పదవి ఎన్నికకు సంబంధించిన సమావేశంలో డీసీసీ అధ్యక్ష పదవి కోసం వరంగల్ తూర్పులోని డివిజన్ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, మహిళలు, కార్యకర్తల నుంచి ముగ్గురి నాయకుల పేర్లను సెలక్షన్ కోసం తీసుకున్నారు. ఈ సమావేశంలో 22వ డివిజన్ తరపున కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# క్యాతంపల్లి నవనాగ క్షేత్రంలో ఆశ్లేష బలిపూజ

■ మాలధారణకు ఏర్పాట్లు

**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** తెలుగు రాష్ట్రాల్లో ఏకైక నవనాగ క్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన ధర్మసాగర్ మండలం (కేశవనగర్ సమీపంలో) క్యాతంపల్లి గ్రామంలోని శ్రీ నవనాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం ఆశ్లేష నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివాహం, సంతానం, సకల కార్యసిద్ధికి, సర్పదోష నివృత్తికి ఆశ్లేషబలి పూజను నిర్వహించారు. సుబ్రహ్మణ్య షష్ఠి మాలధారణ వచ్చే నెల నవంబర్ 26న మార్గశిర శుద్ధ షష్ఠి, అంటే సుబ్రహ్మణ్య షష్ఠి ఉన్నందున, చాలా మంది భక్తులు స్వామివారి మాల ధారణ చేసి సేవలో ఉంటారని ఆలయ అధికారులు తెలిపారు. సుబ్రహ్మణ్య ఉపాసకులు గంట పవన్ కుమార్ శర్మ మాలధారణ వివరాలను తెలిపారు. 41 రోజులు మాల ధరించేవారికి మాలాధారణ చేశారు. 21 రోజులు మాల ధరించేవారు కార్తీక పౌర్ణమి రోజున మాలాధారణ చేసుకోవాలి. 11 రోజులు ధరించేవారు నవంబర్ 15న మాలాధారణ చేసుకోవాలని సూచించారు. మాలధారణ విశిష్టతసుబ్రహ్మణ్య స్వామి మాల ధారణ అనేది పవిత్రమైన, విశేషమైన సంకల్పంతో కూడిన ఆచారంగా భావిస్తారని పవన్ కుమార్ శర్మ వివరించారు. సుబ్రహ్మణ్యేశ్వరుడు సర్పరూపుడుగా భావించబడతాడు. జాతకంలో రాహు-కేతు దోషాలు, కాలసర్ప దోషాలు ఉన్నవారు ఈ మాల ధారణ, ఆరాధన ద్వారా దోషాల నుంచి విముక్తి పొందుతారు. స్వామిని సంతాన ప్రదాతగా భావిస్తారు. మాల ధారణ, ఆరాధన ద్వారా సంతానం లేని వారికి సంతాన సౌభాగ్యం కలిగి, వంశాభివృద్ధి జరుగుతుందని భక్తుల నమ్మకం. స్వామిని పూజించడం వల్ల నేత్ర



రోగాలు, చర్మ వ్యాధులు తగ్గి, ఆయురారోగ్య ఐశ్వర్యాలు కలుగుతాయని విశ్వాసం. దేవసేనాపతి కావడం వల్ల, ఆయన్ని ఆరాధిస్తే ధైర్యం, శక్తి, విజయాలు లభిస్తాయి. ఆధ్యాత్మిక మార్గం: మాల ధారణ సమయంలో పాటించే కఠోర దీక్ష నియమాలు (బ్రహ్మచర్యం, సాత్విక ఆహారం, పూజలు) భక్తులను ఆధ్యాత్మిక మార్గంలోకి నడిపి, ఇంద్రియ నిగ్రహాన్ని, మానసిక ప్రశాంతతను కలిగిస్తాయి.

# ఏనుగల్లులో "పల్లె పల్లెకు మెపా"

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మెపా ( ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ) వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ ముదిరాజ్ అధ్యక్షతన పర్వతగిరి మండలం ఏనుగల్లు గ్రామంలో గురువారం పల్లె పల్లెకు మెపా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఏనుగల్లు గ్రామ కులపెద్ద మనిషి నర్ర సూరయ్య, చెట్టబోయిన రాములు ముదిరాజు, సొసైటీ అధ్యక్షులు తోట రాములు, మొద్దు సత్యం ముదిరాజ్ ల పిలుపు మేరకు ఏనుగల్లుకు రావడం సంతోషం అని, విద్య ఉద్యోగ సాధికారత సాధన కోసం మెపా కృషి చేస్తుందన్నారు. ముదిరాజ్ లని బీసీ-డీ నుంచి బీసీ-ఏ లోకి మార్చడం కోసం ప్రతి ముదిరాజ్ పార్టీలకు అతీతంగా కలిసి రావాలన్నారు. అనంతరం మెపా రాష్ట్ర సహదారులు పులి ప్రభాకర్ ముదిరాజ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న బీసీ ఉద్యమానికి మెపా మద్దతు ఇస్తుందన్నారు. అనంతరం మెపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రాజు ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజ్ లు ఏ పార్టీలో ఉన్న వారి అభివృద్ధి కోసం మెపా పను చేస్తుందన్నారు. రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు ముదిరాజ్ మాట్లాడుతూ ఏనుగల్లు ముదిరాజ్ ల ఐక్యత అందరికీ




ఆదర్శం అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సలహాదారులు పులి ప్రభాకర్ ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం రాజు ముదిరాజ్, రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు ముదిరాజ్, పులి రాజేష్ ముదిరాజ్, పెండ్యాల కృష్ణ ముదిరాజ్,ఏనుగల్లు ముదిరాజ్ పెద్దలు చెట్టబోయిన రాములు, నర్రా సూరయ్య, తోట రాములు, మొద్దు సత్యం, మొద్దు సుధాకర్,దేవేందర్, కుమారస్వామి యాకయ్య, రవి, బిక్షపతి, నరేందర్, సూరయ్య, రమేష్, శేఖర్, నాగరాజు, అనిల్, రవి, మహేందర్ రంజిత్ ముదిరాజ్ లు పాల్గొన్నారు.



# పెద్ది నుంచి త్వరలో లవ్ సాంగ్

## దర్శకుడు బుచ్చిబాబు సానా

రామ్‌చరణ్ హీరోగా జాన్వీ కపూర్ కథానాయికగా 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా కాంబోలో తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది' . ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ సిక్సర్ కొట్టి అభిమానుల్లో విపరీతమైన క్రేజ్ పెంచేసింది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటంతో ఆ క్రేజ్ మరింత రెట్టింపు అయింది. దసరాకు వస్తుందనుకున్న ఫస్ట్ సింగిల్ రాకపోవడంతో ఫ్యాన్స్ కాస్త నిరాశ చెందారు. అయితే దర్శకుడు బుచ్చిబాబు దీపావళికి దద్దరిలే అప్‌డేట్ ఇచ్చారు. తాజాగా జరిగిన ఓ కార్యక్రమంలో తాజా అప్‌డేట్ ఇచ్చారు దర్శకుడు సానా బుచ్చిబాబు. ఆ కార్యక్రమంలో 'పెద్ది' విశేషాలేంటని యాంకర్ ప్రశ్నించగా త్వరలో మంచి లవ్ సాంగ్ ప్రేక్షకుల ముందుకురాబోతుందని. ఆ పాటకు సంగీత దర్శకుడు ఏ.ఆర్ రెహమాన్ అదిరిపోయేలా మ్యూజిక్ ఇచ్చారని ఆయన చెప్పారు. ఆ అప్‌డేట్ ఫ్యాన్స్‌లో ఉత్సాహం నింపింది. అయితే ఈ పాట దీపావళికే వస్తుందని ఆడియన్స్ ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు. దర్శకుడు దానిపై క్లారిటీ ఇవ్వలేదు. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే మాస్, యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. 'ఉప్పెన' బ్లాక్‌బస్టర్ తర్వాత బుచ్చిబాబు నుంచి వస్తున్న సినిమా కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి.






# మంచి ఊపుమీద ఉన్న అనుపమ


## మరో రెండు సినిమాల విడుదల

మలయాళ ముద్దుగుమ్మ అనుపమా పరమేశ్వర్ ఒక్కసారిగా తన జోరు పెంచింది. గత రెండు మూడేళ్ళుగా సెట్స్ మీద ఉన్న ఆమె సినిమాలన్నీ వరుస పెట్టి విడుదల కావడం మొదలైంది. దాంతో ఈ యేడాది అనుపమా పరమేశ్వరన్ నటించిన సినిమా మొత్తం ఆరు జనం ముందుకు వచ్చినట్టయ్యింది. విశేషం ఏమంటే ఈ ముద్దుగమ్మ నటించిన నాలుగు చిత్రాలు ఇప్పటికే ఈ యేడాది విడుదల కాగా, గురువారం ఓ మలయాళ చిత్రం, శుక్రవారం తమిళ చిత్రం జనం ముందుకు వస్తున్నాయి. ఈ యేడాది ప్రారంభంలోనే అనుపమా నటించిన 'డ్రాగన్' మూవీ విడుదలైంది. ఇది తెలుగులోనూ వచ్చింది. ఆ తర్వాత మలయాళ చిత్రం 'జానకి వి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' సినిమా వచ్చింది.అనుపమా ఎంతో ఇష్టంగా చేసిన సినిమా 'పరదా'. తెలుగులో ' సినిమా బండి, శుభం' చిత్రాలను తెరకెక్కించిన ప్రవీణ్ కాండ్రేగుల ఈ సినిమాను రూపొందించాడు. . ఇక ఈ యేడాది వచ్చిన అనుపమా పరమేశ్వరన్ నాలుగో చిత్రం 'కిష్కింధపురి' . బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తో నటించిన 'కిష్కింధపురి' థియేట్రికల్ గా ఆశించిన స్థాయిలో కలెక్షన్స్ రాబట్టలేకపోయినా... ఓటీటీలో మంచి స్పందనే దీనికి లభించింది. తాజాగా దీపావళి కానుకగా అనుపమా పరమేశ్వరన్ నటించిన 'ది పెట్ డిటెక్టివ్' అనే మలయాళ చిత్రం గురువారం జనం ముందుకు వచ్చింది. నిజానికి ఇది గత యేడాది విడుదల కావాల్సిన సినిమా. రకరకాల కారణాలతో వాయిదా పడి ఎట్టకేలకు విడుదలైంది. ఇక శుక్రవారం ఆమె నటించిన తమిళ చిత్రం 'బైసన్' విడుదల కాబోతోంది. మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సీనియర్ హీరో విక్రమ్ తనయుడు ధృవ్ హీరోగా నటించాడు. గతంలో మారి సెల్వరాజ్ తెరకెక్కించిన 'పరియేరుమ్ పెరుమాళ్'లో తనకు నటించే అవకాశం వచ్చిందని, కానీ అప్పుడు దాన్ని ఉపయోగించుకోలేక పోయానని, ఇప్పుడు మరోసారి ఆయన మూవీ 'బైసన్'లో ఛాన్స్ దక్కడం ఆనందాన్ని కలిగించిందని అనుపమా చెబుతోంది. మరి ఈ రెండు సినిమాల్లో ఏదైనా ఆమెకు మెమొరబుల్ హిట్ ను అందిస్తుందేమో చూడాలి.

# సక్సెస్‌కు రవితేజ ఎదురుచూపు

## 31న వస్తున్న మాస్ జాతర

మాస్ మహరాజా రవితేజ కు సాలీడ్ హిట్ పడి చాలా కాలమే అయ్యింది. చిరంజీవితో కలిసి రవితేజ నటించిన 'వాల్తేరు వీరయ్య' తర్వాత మళ్ళీ ఆ స్థాయి సక్సెస్ ను రవితేజ చూడలేదు. అయితే బ్యాక్ టు బ్యాక్ సినిమాలు మాత్రం రవితేజ చేసేస్తున్నాడు. అక్టోబర్ 31న రవితేజ 75వ చిత్రం 'మాస్ జాతర' జనం ముందుకు రాబోతోంది. 'ధమాకా'తర్వాత శ్రీలీల మరోసారి ఈ సినిమాలో రవితేజతో జోడీ కట్టింది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా పాటలు బాగానే అలరిస్తున్నాయి. నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాతో రచయిత భాను భోగవరపు దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఇది యాక్షన్ ఎంటర్ టైనర్ జానర్ కు చెందిన సినిమా. ప్రస్తుతం రవితేజ నటిస్తున్న 76వ చిత్రానికి కూడా ఒకప్పటి రచయిత కిశోర్ తిరుమల దర్శకత్వం వహిస్తున్నాడు. 'నేను శైలగ, ఉన్నది ఒకటే జిందగీ, రెడ్' వంటి రొమాంటిక్, యాక్షన్ మూవీస్ ను తీసిన అనుభవం కిశోర్ తిరుమలకు ఉంది. పైగా అతనిది మంచి పెన్. రవితేజ సరసన ఈ సినిమా ఆషికా రంగనాథ్, కేతిక శర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ స్పెయిన్ లో జరుగుతోంది. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమాకు మొదట్లో 'అనార్కలి' అనే టైటిల్ అనుకున్నారు. కానీ ఇప్పుడీ సినిమాకు 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అనే పేరు పెట్టబోతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. రాబోయే సంక్రాంతి బరిలో ఈ సినిమా కూడా నిలుస్తుందని అంటున్నారు. ఇది ఫ్యామిలీ డ్రామా. ఇక రవితేజ చేయబోతున్న 77వ చిత్రాన్ని శివ నిర్వాణ డైరెక్ట్ చేయబోతున్నాడని తెలుస్తోంది. 'నిన్ను కోరి, మజిలి, టక్ జగదీశ్, ఖుషీ' సినిమాలను తెరకెక్కించిన శివ నిర్వాణ ఈసారి థ్రిల్లర్ డ్రామాను తీయబోతున్నాడట. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ దీనిని ప్రొడ్యూస్ చేస్తుందని తెలుస్తోంది. ఇందులో రవితేజ తన వయసుకు తగ్గ పాత్ర చేస్తాడని అంటున్నారు. ఇక రవితేజ చేయబోతున్న 78వ సినిమాను కళ్యాణ్ శంకర్ డైరెక్ట్ చేస్తాడని సమాచారం. 'మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్' చిత్రాలను డైరెక్ట్ చేసిన కళ్యాణ్ శంకర్ నిజానికి 'టిల్లూ క్యూబ్' కు డైరెక్ట్ చేయాల్సి ఉంది. సూర్యదేవర నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తానని చెప్పారు. అయితే ఇప్పుడు కళ్యాణ్ శంకర్... ఆ సినిమాను పక్కన పెట్టి రవితేజతో ఓ సూపర్ హీరో మూవీ చేస్తాడని సమాచారం. సో... 'మాస్ జాతర' తర్వాత నాగవంశీ... రవితేజతో తీయబోయే సినిమా ఇది. ఇలా... వరుసగా నాలుగు డిఫరెంట్ జానర్స్ తో రవితేజ సినిమాలు చేస్తున్నాడు. మరి ఈ చిత్రాలలో ఏవేవి రవితేజను తిరిగి సక్సెస్ ట్రాక్ లోకి తీసుకొస్తాయో చూడాలి.





## రశ్మిక మైసా సంగీత దర్శకుడుగా జేక్స్ బిజోయ్

నేషనల్ క్రష్ రశ్మిక మందన నటిస్తున్న పవర్ ఫుల్, ఫీమేల్ సెంట్రిక్ యాక్షన్ మూవీ 'మైసా' ఈ సినిమాతో రవీంద్ర పుల్లె డైరెక్టర్ గా అరంగేట్రం చేస్తున్నాడు. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ సంస్థ భారీ బ్జడెట్‌తో పాన్`ఇండియా స్థాయిలో 'మైసా' సినిమాను నిర్మిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా మేకర్స్ ఒక ఇంట్రస్టింగ్ అప్డేట్ ఇచ్చారు. నాని నటించిన 'సరిపోదా శనివారం' చిత్రానికి సంగీతం అందించిన ప్రముఖ సంగీత దర్శకుడు జేక్స్ బిజోయ్ ను 'మైసా' చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్ గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జేక్స్ బిజోయ్ ట్రైబల్ వాయిద్యాలతో రీరికార్డింగ్ చేస్తున్న వీడియోను రిలీజ్ చేశారు. ఈ సౌండిరగ్ అదిరిపోయింది. 'మైసా' మ్యూజికల్ గా గ్రాండ్ స్కేల్ లో వుండబోతుందని ఈ వీడియో చూస్తే అర్ధమౌతోంది. 'మైసా' గోండు తెగల బ్యాక్ డ్రాప్ లో హై`ఆక్టేన్ ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్ గా ఉండబోతోంది. రశ్మిక మందణ్ణ ఇంతకుముందు ఎప్పుడూ చూడని ఇంటెన్స్ అవతార్ లో కనిపించనుంది. ఈ సినిమాకు సూర్య 'రెట్రో' సినిమాకి పని చేసిన శ్రేయాస్ పి కృష్ణ డీవోపీగా పని చేస్తున్నారు. యాక్షన్ ని 'కల్కి 2898 ఏ డీ' ఫేమ్ ఆండి లాంగ్ డిజైన్ చేస్తున్నారు.

# క్రీడలకు ప్రాధాన్యం

- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- ఘనంగా ప్రారంభమైన అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ ప్రభుత్వం క్రీడా రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో గురువారం 5వ నేషనల్ ఓపెన్ అండర్–23 అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీలను కడియం కావ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖేలో ఇండియా–2026 క్రీడలను హైదరాబాద్‌లో నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. 2036లో భారత్‌లో జరగనున్న ఒలింపిక్స్ క్రీడల్లో కొన్ని గేమ్స్ తెలంగాణలో నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియాన్ని క్రీడాకారులకు అనువుగా అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదం చేస్తాయని, క్రీడా స్ఫూర్తితో ప్రతి క్రీడాకారుడు పోటీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ పోటీల్లో దేశ వ్యాప్తంగా 945 మంది మహిళా అథ్లెటిక్స్ పాల్గొంటుండగా, వారిలో 20 మంది తెలంగాణకు చెందినవారని ఎంపీ పేర్కొన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ చైర్మన్ ఎర్రబెల్లి రాజేశ్వరరావు, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, మేయర్ గుండు సుధారాణి, గ్రంథాలయ చైర్మన్ అజీజ్ ఖాన్, క్రీడా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**పోషణ మాసం ముగింపు ఉత్సవం..**

మాతా, శిశు సంపూర్ణ ఆరోగ్య రక్షణే లక్ష్యంగా రాష్ట్ర సర్కారు ముందు కెళ్తోందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. అందుకోసం ప్రతి ఏడాది పోషణ్ అభియాన్ పేరిట మాసోత్సవాలను నిర్వహిస్తోందన్నారు. హనుమకొండ మిలీనియం కన్వెన్షన్ లో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ మాసం ముగింపు ఉత్సవానికి కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, మహిళలు, గర్భిణీలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో పోషకాహారం ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి కుటుంబం ఆరోగ్యవంతంగా ఉండేందుకు సమాజంలో పోషణపై అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని చెప్పారు. ఒక కుటుంబం ఆరోగ్యంగా ముందుకు వెళ్లాలంటే కుటుంబంలో మహిళల పాత్ర ప్రత్యేకమన్నారు. పోషణ మాసంలో భాగంగా ఏర్పాటు చేసిన కమ్యూనిటీ బేస్డ్ ఈవెంట్స్, గర్భిణీలకు సామూహిక సీమంతాలు, ఆరు నెలలు పూర్తయిన పిల్లలకు అన్నప్రాసనలు, అంగన్వాడి పూర్వ ప్రాథమిక విద్యకి నమోదైన పిల్లలకు అక్షరాభ్యాసంలో ఎంపీ కడియం కావ్య పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, డీఎంహెచ్ఓ, డీడబ్ల్యూఓ, ప్రిన్సిపల్ సైంటిస్ట్ కేవీకే, అంగన్వాడీ టీచర్లు, సీడీపీఓలు తదితరులు పాల్గొన్నారు.

# మహాదేవయ్యను విధుల్లోకి తీసుకోవాలి

- గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు వెంకటేశ్వర్లు
- హనుమకొండ పోస్టల్ డివిజన్ ఆఫీసు ఎదుట ధర్నా



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం ఆలిండియా ప్రధాన కార్యదర్శి ఎస్ ఎస్ మహాదేవయ్యను అప్రజాస్వామికంగా సర్వీస్ నుంచి తొలగించడాన్ని నిరసిస్తూ గ్రామీణ తపాలా ఉద్యోగులు హనుమకొండ పోస్టల్ డివిజన్ ఆఫీసు ఎదుట బుధవారం సాయంత్రం ధర్నా చేశారు. ధర్నాకు నాయకత్వం వహించిన అఖిలభారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు బొద్దున వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జీడీఎస్ ల కొరకు వేసిన కమలేశ్ చంద్ర అనుకూల సిఫార్సులను అమలు చేయాలని కోరుతూ జేసీఏ ఆధ్వర్యంలో చేసిన నాలుగు రోజుల నిరవధిక సమ్మెకు బాధ్యున్నిచేసి కక్ష్య పూరితంగా తమ జాతీయ నేతను అక్రమంగా సర్వీసు నుంచి తప్పించడం చట్టవిరుద్ధమన్నారు. కేంద్ర ప్రభుత్వం, తపాలా శాఖ భేషజాలకు పోకుండా రాజ్యాంగబద్ధంగా జీడీఎస్ ల కొరకు పోరాటం చేసిన మహాదేవయ్యను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, జీడీఎస్ కమిటీ సానుకూల సిఫార్సులను అమలుచేసి రాబోయే 8వ పే కమిషన్ పరిధిలోకి చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నాలో ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ క్లాస్–3 సెక్రటరీ టి.సారయ్య, పోస్ట్ మెన్, ఎంటీఎస్ సెక్రటరీ కె.అశోక్, ప్రెసిడెంట్ బి.అరవింద్, జీడీఎస్ ప్రెసిడెంట్ పెరుమాండ్ల తిరుపతి, శంకర్, అజయ్ పాల్, పరంజ్యోతి, శ్రీలత, జె.బాపూజీ, ఎస్. ఎల్లయ్య, పి.అశోక్, ఆనందం, ఎం.రమేష్ కుమార్ పాల్గొన్నారు.



# 18న బంద్‌ను విజయవంతం చేయండి

- బీసీ రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్ లో చేర్చే వరకు ఉద్యమిస్తాం
- ఉమ్మడి జిల్లా బీసీ జేఏసీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల 18న జరిగే బీసీ బంద్ ను విజయవంతం చేయాలని బీసీ జేఏసీ వరంగల్ ఉమ్మడి జిల్లా చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం హనుమకొండ నక్కలగుట్ట కాకతీయ హరిత హోటల్ లో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో జరిగే బీసీ బంద్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య, కార్పొరేట్ రంగాలన్నీ అగ్రవర్ణాల గుప్పిట్లో ఉన్నాయని ఆరోపించారు. ఆ అగ్రవర్ణాలే బంద్ ను విఫలం చేసేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. బంద్ కు సహకరించకపోతే ఖాబర్దార్ అంటూ హెచ్చరించారు. ఈ నెల 18 న జరుగుతున్న బంద్ కు వరంగల్ ఉమ్మడి జిల్లాలోని విద్యాసంస్థలు, వాణిజ్య సంస్థలు, పెట్రోల్ బంకులు, సినిమా హాల్స్, హోటల్స్, బస్సులు, ఆటోలు, షాపింగ్ మాల్ లు, ఇంకా మిగితా అన్ని సంస్థలు స్వచ్ఛందంగా బంద్ లో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం ఓబీసీ చైర్మన్ సంగం రెడ్డి సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆర్డినెన్స్ తీసుకొచ్చిన ప్రభుత్వం దాన్ని కాపాడుకోవడం కోసం చేస్తున్న ప్రయత్నాలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ విషయంలో ఇలాంటి డిమాండ్ లేకున్నా చట్టం తక్షణమే రూపొందించారని విమర్శించారు. రిటైర్డ్ ప్రొఫెసర్ కూర కూరపాటి వెంకట్ నారాయణ మాట్లాడుతూ రిజర్వేషన్ల కోసం చేసే పోరాటాలను, రాజ్యాధికార పోరాటాలు మిళితం చేసి సరికొత్త ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరం బీసీ సమాజం గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మరావు, బీసీ జేఏసీ నాయకులు దొడ్డపల్లి రఘుపతి, దాడి మల్లయ్య యాదవ్, బోనగాని యాదగిరి గౌడ్, వైద్యం రాజగోపాల్, తమ్మేలా శోభరాణి, గడ్డం భాస్కర్, పెరిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగాని మల్లేశ్వర్, కుమ్మరి సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆకారపు మోహన్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు పల్లెపు సమ్మయ్య, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు బచ్చు ఆనందం, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షులు ఆడెపు రవీందర్, యాదవ్ సంఘం జిల్లా అధ్యక్షులు గిరిబోయిన రాజయ్య యాదవ్, నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు నాగవెల్లి సురేష్, రజక సంఘం జిల్లా అధ్యక్షులు సాంబరాజు అంకయ్య, గోపా జిల్లా అధ్యక్షులు కాకతీయ యూనివర్సిటీ ఈసీ మెంబర్ డాక్టర్ చిర్ర రాజు గౌడ్, బీసీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాళ్లపల్లి సురేష్ గౌడ్, తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీపతి గోపి, ఆరేగంటి నాగరాజు, పాండవుల సురేష్, మాదం పద్మజదేవి, తెల్ల సుగుణ – కిషోర్, తాడిశెట్టి క్రాంతి, దాడబోయిన శ్రీకాంత్ యాదవ్, గంగపురం వేణుమాధవ్, ఏరుకొండ పవన్ గౌడ్, గొట్టె మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. గురువారం వరంగల్ సూపర్ స్పెషాలిటి హాస్పటల్ ను కలెక్టర్ సందర్శించి సంబంధిత అధికారులతో సమావేశమై పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా భవనంలోని సివిల్, ఎలక్ట్రికల్ పనుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకొన్నారు. ఈ సమావేశంలో ఎంజీఎం హాస్పటల్ సూపరింటెండెంట్ కిషోర్, కేఎంసీ ప్రిన్సిపాల్ సంధ్యారాణి, ఆర్ఎంవోలు, వివిధ విభాగాల అధిపతులు, ఆర్ & బి డిపార్ట్మెంట్ ఇజనీర్లు, ఎల్ & టీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# 'నా ఆలోచనలు' పుస్తకావిష్కరణ

**రచయిత పిన్నింటిని అభినందించిన కేటీఆర్**

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** గొప్ప సామాజిక స్పృహ, తెలంగాణ మీద మమకారంతో పనిచేస్తున్న బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంపై నమ్మకంతో కాకతీయ యూనివర్సిటీ బీఆర్ఎస్వీ నాయకులు పిన్నింటి విజయ్ కుమార్ రాసిన అనేక వ్యాసాలను 'నా ఆలోచనలు' అనే శీర్షికతో ఒక మంచి పుస్తకం రాయడం గొప్ప పరిణామమని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రచయితను అభినందించారు. తెలంగాణ భవన్ వేదికగా పార్టీ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం గురించి, ప్రాంతీయ, జాతీయ పరిస్థితులపై చాలా మంచి అవగాహనతో ఎన్నో వ్యాసాలను గతంలో రాశారు. ఇప్పుడు కొత్తగా ఆ వ్యాసాలన్నింటిని 'నా ఆలోచనలు' అనే పుస్తకం ద్వారా మీ ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సందర్భంగా జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్రలు ప్రత్యేకంగా పుస్తక ఆవిష్కరణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ రాజయ్య, మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్, శేరి సుభాష్ రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు, కాకతీయ యూనివర్సిటీ బీఆర్ఎస్వీ ఇంచార్జి జెట్టి రాజేందర్, రాజేష్ నాయక్, ప్రశాంత్, అభిషేక్, నితిన్, రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొని పిన్నింటి విజయ్ కి అభినందనలు తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com